క్లుప్తంగా

నేడు బెల్లంపల్లికి మంత్రి శ్రీధర్‌బాబు రాక

బెల్లంపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం బెల్లంపల్లికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి శివారు కన్నాలలోని ఆర్‌పీ గార్డెన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రితో పాటు మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి హాజరవుతారు. పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

19న బెల్లంపల్లిలో దివ్యాంగుల శిబిరం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఈ నెల 19న దివ్యాంగుల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ, మహిళ శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగరేణి కళావేదికలో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపా రు. శిబిరానికి బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, మందమర్రిరూరల్, అర్బన్ ప్రాంతాల దివ్యాంగులు హాజరుకావాలని పేర్కొన్నారు. పరీక్షలు చేసి అర్హత కలిగిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ శిబిరా నికి హాజరయ్యే దివ్యాంగులు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి స్వాగతం



ఉపాధ్యాయుడికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

భీమారం: ఇటీవల విడుదలైన 2008డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయునిగా ఎంపికైన జంగా హరికృష్ణారెడ్డికి భీమారం బీసీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పోస్టింగ్ ఇచ్చారు. హరికృష్ణారెడ్డి సోమవారం పాఠశాలకు వెళ్లి విధుల్లో చేరారు. పాఠశాల విద్యార్థులు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెన్నెల: బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల, బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని నెన్నెల విద్యుత్ ఏఈ రాజన్న తెలిపారు. శివాలయం 33కేవీ కన్నెపల్లి ఫీడర్‌లో రైల్వేక్రాసింగ్ కేబుల్ మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మ ధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కులగణన సర్వే సద్వినియోగం చేసుకోండి

మందమర్రిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వే ఈ నెల 28వరకు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రంలో సంబంధిత ఫారంలో కుటుంబసభ్యుల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ విషయాలను నమో దు చేసుకోవాలని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

నెన్నెల: ఆరు గ్యారంటీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు కోరారు. మండలంలోని గుండ్లసోమారంలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు చరణ్, నాయకులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ జయప్రదం చేయండి

రామకృష్ణాపూర్: ఆర్‌ఎంపీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన ‘హలో ఆర్‌ఎంపీ–చలో హైదరాబాద్’ పోస్టర్లను సోమవారం పట్టణంలో ఆవిష్కరించారు. ఆర్‌ఎంపీలకు శిక్షణనిచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలని, ఆర్‌ఎంపీ, పీఎంపీ, సీపీలపై జరుగుతున్న దాడులు నిలిపేసి, కేసులు ఎత్తివేయాలని కోరారు. ఆర్‌ఎంపీలకు కమ్యూనిటీ పారామెడిక్స్ గుర్తింపు ఇవ్వాలని కోరారు. మంగళవారం తలపెట్టిన ‘చలో హైదరాబాద్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాటిదారి..రహదారి



భీమారం: మండల కేంద్రం గుండా వెళ్తున్న జాతీయ రహదారిపై ఆవిడం రోడ్డు నుంచి కొత్తగూడెం వరకు రాత్రివేళ పశువులు మకాం వేయడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే వాహనదారులకు పశువులు రోడ్లపైన ఉన్న విషయం స్పష్టంగా కనపడక పోవడంతో ప్రమాదాలు సంబవిస్తున్నాయి. లారీలతో పాటు గుర్తు తెలియని వాహనాలు ఢీకొని పదుల సంఖ్యలో గేదెలతో పాటు ఆవులు మృతి చెందాయి. పశువులు రోడ్డుపై నిలువకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు వేశారు.. క్యూరింగ్ మరిచారు



మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని చిర్రకుంట శివారులో గల తుర్కపల్లిలో ఇటీవలే ఓ రైతు వ్యవసాయ భూమిలో రూ.3లక్షల ఉపాధి హామీ నిధులతో వంద మీటర్ల సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డు పూర్తై నాలుగైదు రోజులు గడుస్తున్నా, వాటర్ క్యూరింగ్ మాత్రం చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్డును పరిశీలించి, ప్రభుత్వ నిధులతో వేసిన రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేయించాల్సిందిగా పలువురు సూచిస్తున్నారు. ఓ నాయకుడి వ్యవసాయక్షేత్రంలో ఆ రోడ్డును నిర్మించినట్లు బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

బోరుచుట్టూ మురుగు..!



కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలో ప్రధాన రహదారి పక్కన గల బోరు పంపు నుంచి వృథా అయిన నీరు రోడ్డుపైకి రావడంతో రోడ్డుపై బురదగా మారి వచ్చిపోయే వాహనాలకు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మురుగునీరు నిల్వతో దోమలు వ్యాప్తి చెంది రోగాలబారిన పడుతున్నామని పలుమార్లు కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని తెలిపారు. అధికారులు స్పందించి బోరు వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు

- కలెక్టర్ కుమార్‌దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: అర్హులైన దివ్యాంగులకు ఉపయోగపడేలా సహాయ ఉపకరణాలు ఉచితంగా అందించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ, అలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాలను పంపిణీ చేసేందుకు అర్హుల ఎంపిక శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు భోజనం, మజ్జిగ, తాగునీరు అందించారు. హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీన చెన్నూర్‌లోని మైనారిటీ ఫంక్షన్‌హాల్‌లో, 19వ తేదీన బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి కళావేదికలో, 20న లక్సెట్టిపేట్‌లోని రైతువేదికలో శిబిరాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫూఫ్‌ఖాన్, అలింకో సంస్థ వైద్యులు డాక్టర్ సునీత సభాదర్శిని దాస్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి ఎం డీ.ఫర్జానా బేగం, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను సక్రమంగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్, మార్పుల ప్రక్రియలలో భాగంగా సబ్‌రిస్ట్రార్‌తోపాటు, తహసీల్దార్ కార్యాలయంలో జరిగే లావాదేవీలపై ఆదాయానికి పన్ను చెల్లింపు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, ఐటీ అధికారి సూర్యభగవాన్‌తో కలిసి సబ్‌రిజిస్ట్రార్ మండల తహసీల్దార్లతో ఆదాయపు పన్ను చెల్లింపు, రికార్డుల నిర్వహణపై సోమవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ సమయంలో రూ.10 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో లావాదేవీ జరిగే సమయంలో పాన్‌కార్డు సమర్పించని వారు ఫారం–60 జత చేయాలని, సంబంధిత రిజిస్ట్రార్/ తహసీల్దార్ ఫారం 61 ద్వారా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. పాన్‌కార్డ్ కలిగి రూ.30 లక్షల కన్నా ఎక్కువగా లావాదేవీ జరిగినప్పుడు సంబంధిత రిజిస్ట్రార్, తహసీల్దార్ ఫారం–61(ఎ) ద్వారా వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యాలయాలకు సంబంధించి ఐటీ ఖాతా తెరిచేందుకు సంబంధిత కార్యాలయం టాన్ నంబర్, చిరునా మా, ఈ మెయిల్, కార్యాలయం తరపున అధికారిక వ్యక్తుల పాన్‌కార్డు నకలు ప్రతి జతపర్చాలని తెలిపారు.

ఒలింపియాడ్‌లో నస్పూర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న సబిహా సుల్తానా

నస్పూర్: సుచీర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవల్ సీవీ.రామన్ ఒలింపియాడ్ టెస్టులో నస్పూర్ విద్యార్థులు ప్రతి కనబర్చి బహుమతులు సాధించారు. హైదరాబాద్‌లోని పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన టెస్టులో పట్టణ పరిధిలోని మార్టిన్ గ్రామర్ హై స్కూల్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థిని ఇ.అనుశ్రీ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఏ.రిషిత(2వ), ఈ.సాత్విక్ (6వ), ప్రీతివర్ధన్ (7వ), ఎస్.అర్చన(8వ), కే.అశ్రిత (9వ), జీ.సాయిచరణ్, ఆర్.ప్రదీప్తి (10వ) తరగతుల విద్యార్థులు జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సబిహా సుల్తానా అభినందించారు.

బుగ్గలో ఎమ్మెల్యే వినోద్ ప్రత్యేక పూజలు



శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే వినోద్, నాయకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గ ఆలయానికి నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించి పనులను నాణ్యతతో జాతర సమయానికి పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తులకు రాకపోకలు సాగించడానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, నాయకులు రమేష్‌బాబు, స్వామి, రమేష్, శ్రీదేవి, అనిత, భరత్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీగా అవకాశం కల్పించండి’



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

నస్పూర్: రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ కోరారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో ఐదు సార్లు కార్పొరేటర్‌గా, ఒకసారి నగర మేయర్‌గా, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ఓటరుగా ఎన్‌రోల్ చేసుకున్న అభ్యర్థులందరికీ రూ.1కే రూ.5లక్షలు ఇన్సూరెన్స్ చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ట్రస్మా ఉందని, అందులో పనిచేసే టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎలాంటి యూనియన్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీసం పీఎఫ్ సౌకర్యం కూడా లేదన్నారు. ప్రైవేటు టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ కంది క్రాంతి యాదవ్, కోమటిరెడ్డి తేజ్‌దీప్ రెడ్డి, సాయి వర్ధన్, సిజ్జు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



మంచిర్యాలటౌన్: కేక్ కట్ చేస్తున్న నాయకులు



నస్పూర్: మొక్క నాటుతున్న సురేందర్‌రెడ్డి

మంచిర్యాలటౌన్/దండేపల్లి/జన్నారం/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/లక్సెట్టిపేట/తాండూర్ (బెల్లంపల్లి)/నెన్నెల/జైపూర్/నస్పూర్/భీమిని: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. పలుచోట్ల రోగులకు పండ్లు పంపిణీ చేశారు. హరిత సేనా జన్నారం మండల ఇన్‌చార్జి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, నస్పూర్‌లో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, దండేపల్లిలో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు లింగన్న, రవీందర్, మాజీ వైస్‌ఎంపీపీ అనిల్, మాజీ ఉపసర్పంచ్ భూమన్న, జన్నారంలో పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, జన్నారంలో మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జనార్దన్, రామకృష్ణాపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, తాండూర్‌లో మాజీ ఎంపీపీ పి.ప్రణయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గట్టు సంతోష్‌కుమార్, నెన్నెలలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు ఆయుర్వేద శిబిరం

నస్పూర్: పట్టణ పరిధిలోని నస్పూర్ కాలనీ మనోరంజన్ సముదాయంలో డాక్టర్ విశ్వనాథమహర్షి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ జీఎం అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక రోగాలు బీపీ షుగర్, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు వంటి వాటికి పరీక్షలు నిర్వహించి, మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఎన్నికల్లో గెలుపు కోసం అబద్ధపు హామీలు’

మంచిర్యాలఅర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుకోసం అబద్ధపు హామీలతో ముందుకొస్తున్న నరేందర్‌రెడ్డిని నమ్మొద్దని పలు విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్, గోపాల్, ప్రవీణ్, నితీష్, క్రాంతి కోరారు. విద్యార్థి, నిరుద్యోగుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో కార్పొరేట్ శక్తులకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వినతి

జన్నారం: గ్రామపంచాయతీలో గత సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల కార్యదర్శుల సంఘం నాయకులు మధు, విశ్వ, రాజన్న, రమేశ్, సాగర్, జలందర్ తదితరులున్నారు.


నివాళి

పాతమంచిర్యాల: మనువాదానికి వ్యతిరేఖంగా పోరాటం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రఖ్యాత ఖగోళ సిద్ధాంత కర్త, గణిత శాస్త్రజ్ఞుడు గియార్డానో బ్రూనో వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొ గిళి లక్ష్మణ్, నాయకులు మాడిశెట్టి సత్యనారాయణ, కీర్తి రాజు, మొండి, మాడిశెట్టి సురేష్, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

నియామకం

మందమర్రిరూరల్: మాదిగ హక్కుల దండోర మందమర్రి పట్టణ ఇన్‌చార్జిగా కొలుగూరి విజయ్‌కుమార్, కో కన్వీనర్‌గా సుద్దాల జనార్దన్, బత్తుల సరితను నియమిస్తూ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నియామకపత్రాలు అందజేశారు.

ఘనంగా రామాలయం ప్రారంభోత్సవం



ఆలయానికి తరలివచ్చిన భక్తులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ టేకుల బస్తీలో సోమవారం అట్టహాసంగా భక్తి ప్రపత్తులతో రామాలయం ప్రారంభోత్సవం నిర్వహించారు. శతాబ్ద కాలం నాటి రామాలయాన్ని పున:నిర్మించగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య పూజలతో ప్రారంభించారు. మడికొండ పోలీసుసర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ పులియాల కిషన్, జయమాల దంపతులు ధ్వజస్తంభాన్ని, మరో సీఐ ముస్కె శ్రీనివాస్ చైత్ర దంపతులు సీత, రాముడు, ఆంజనేయస్వామి ఇతర దేవతల విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గడిచిన రెండు రోజుల నుంచి ఆలయంలో హోమం చేశారు. రామాలయం ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన పూజ కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మహా అన్నదానం చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, బస్తీ ప్రముఖులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ‘సహకారం’



భీమారం: మండల కేంద్రంలో దాదాపు 30ఏళ్ల క్రితం నిర్మించిన సహకార సంఘం భవనం నేడు శిథిలావస్థకి చేరింది. గతంలో భీమారం గ్రామంలో సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి నడిపిన ప్రభుత్వం, మండలానికి ఒకే సంఘం ఉండాలనే ఉద్దేశంతో అప్పటి ఉమ్మడి మండలం అయిన జైపూర్‌లో భీమారం సంఘాన్ని విలీనం చేశారు. అప్పటి నుంచి జైపూర్ మండల కేంద్రంలోని సహకార సంఘం ద్వారా భీమారం పరిధిలో రైతులకు రుణాలు ఇస్తున్నారు. అయితే భీమారంలో సహకార సంఘం ఉన్న సమయంలో పక్కా భవనాన్ని నిర్మించిన అధికారులు, అనంతరం దానిని ఖాళీ చేశారు. దీంతో అప్పటి నుంచి అది నిరుపయోగంగా ఉంటుండగా కొత్త మండలంగా భీమారం ఏర్పడ్డ అనంతరం సహకార సంఘంలో తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో ఊరుస్తుడడంతో అందులో నుంచి కార్యాలయాన్ని ఖాళీ చేశారు. అయితే తిరిగి భీమారం మండల కేంద్రంలో కొత్తగా సహకార సంఘం ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో శిథిలావస్థకి చేరిన భవనానికి మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని వినతి

జన్నారం: మండలంలోని పొనకల్ గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న మూడెకరాల స్థలాన్ని నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి కేటాయించాలని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, ఉపాధ్యక్షుడు రాందాస్, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా, మండల నాయకులు కిషన్, నర్సయ్య, చంద్రయ్య, దర్మ, కైలాస్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నేతకానీలకు ప్రత్యేక రిజర్వేషన్లు ప్రకటించాలి



మాట్లాడుతున్న గొల్లపల్లి రాజమల్లు

చెన్నూర్: నేతకాని కులస్తులను ఎస్సీ–సీలో చేర్చకుండా ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని నేతకాని మహర్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి రాజమల్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. కొందరు మాల నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం నేతకాని జాతి ఉనికి లేకుండా చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ వెంకటేశ్‌నేత, మందకృష్ణ మాదిగలు నేతకాని ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా అన్యాయం జరుగుతుందని మాట్లాడారన్నారు. నేతకానీల సమస్యలపై ఏనాడూ మాట్లాడని వారు కూడా మాజీ ఎంపీ, మందకృష్ణపై ఆరోపణలు చేయిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నేతకాని మహర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి యువరాజ్, రాష్ట్ర పధాన కార్యదర్శి దుర్గం సంతోష్, జిల్లా నాయకులు కొఠారి వెంకటేశ్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి నిరాశ..!



హాల్ ఎదుట లింగయ్య

నస్పూర్: పట్టణ పరిధిలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో తనబాధ చెప్పుకొని సహాయం పొందుతామని వచ్చిన ఓ దివ్యాంగుడికి నిరాశ ఎదురైంది. ఎలక్షన్ కోడ్‌తో ప్రజావాణి రద్దు కాగా అది తెలీక కాన్ఫరెన్స్ హాల్ ఎదుట నీరసించి కూర్చున్నాడు. కన్నెపల్లి మండలం సాలాం గ్రామానికి చెందిన భీమిని లింగయ్య దినసరి కూలి. ఐదు సంవత్సరాల క్రితం పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు అతని ఎడమ కాలుకు గాయం అయింది. వైద్యులు చికిత్స చేసి కాలును సగం వరకు తొలగించారు. కృత్రిమ కాలుతో తన జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. నేటి వరకూ అతడికి వికలాంగుల పెన్షన్ రాకపోవడంతో ప్రజావాణిలో ధరఖాస్తు చేసుకోవడానికి వచ్చినట్లు తెలిపారు.